క్లుప్తంగా

చిత్రలేఖనంలో సాత్విక్ ప్రతిభ



ప్రథమ బహుమతి గెలుచుకున్న చిత్రం



సాత్విక్

కంబాలచెరువు: ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా జరిగిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ డ్రాయింగ్ కాంపిటేషన్‌లో ఆర్యాపురంలోని చైతన్య టెక్నో స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి మోటూరి సాత్విక్ ప్రథమ స్థానంలో నిలిచాడు. మినిస్టరీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమట్ చేంజ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ పోటీలకు దేశ వ్యాప్తంగా 4,386 చిత్రాలు వెళ్లాయి. ఈ సందర్భంగా సాత్విక్‌కు ప్రథమ బహుమతిగా నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం ఇచ్చారు. కేరళకు ద్వితీయ, హర్యానాకు తృతీయ బహుమతి లభించాయి. కాగా.. సాత్విక్‌కు ఆయన తండ్రి మోటూరి శ్రీ, స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.సురేంద్ర, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

స్మరణ కోసమే ఆధ్యాత్మిక సాధన

రాజమహేంద్రవరం రూరల్: ఆధ్యాత్మిక సాధన స్మరణ కోసమేనని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఆదివారం ఆయన కొంతమూరులోని వల్లభ గణపతి ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్య సహస్ర నామస్తోత్ర వైభవం అనే అంశంపై అనుగ్రహ భాషణం చేశారు. సనాతన ధర్మ పరిరక్షణకు సుబ్రహ్మణ్య ఉపాసన అవసరమన్నారు. ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ టీవీ నారాయణరావు, అప్పాజీ, హనుమంతరావు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం వ్యవహరించాలి

కడియం: వినాయక ఉత్సవ కమిటీలు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని దక్షిణ మండల డీఎస్పీ కె.శ్రీనివాసులు ఆదేశించారు. మండలంలోని ఉత్సవ కమిటీ ప్రతినిధులతో ఆదివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ నిబంధనలను వారికి వివరించారు. సంప్రదాయబద్ధంగా, ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్, ఎస్ఐ బాలాజీ పాల్గొన్నారు.

పోస్టుకార్డు ఉద్యమం

రాజమహేంద్రవరం రూరల్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ నియోజకవర్గంలో పోస్టుకార్డు ఉద్యమాన్ని తాను స్వయంగా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆదివారం బొమ్మూరులోని రిలే నిరాహార దీక్షా శిబిరంలో ఆయన పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి సందడి



రాజమహేంద్రవరం కంబాలచెరువు సెంటర్‌లో కోలాహలం



సత్యదేవ నర్సరీలో పువ్వులతో ఏర్పాటు చేసిన వినాయకుని చిత్రం

- ముస్తాబైన ఆలయాలు
- పలు వీధుల్లో పందిళ్ల ఏర్పాటు
- కిటకిటలాడిన మార్కెట్లు

సీటీఆర్ఐ: వినాయక చవితికి సర్వం సిద్ధమైంది. తొలిపూజ అందుకునే గణనాథున్ని కొలిచేందుకు ప్రజలందరూ సిద్ధమయ్యారు. పూజకు కావాల్సిన వివిధ రకాల పత్రి, పువ్వులు, పండ్లు, గణపతి ప్రతిమలతో మార్కెట్లన్నీ సందడిగా మారాయి. స్థానిక కంబాలచెరువు, జాంపేట, గాంధీబొమ్మ వద్ద, గోదావరి గట్టు తదితర ప్రాంతాల్లో దుకాణాలు వెలిశాయి.ఇదే సమయంలో వాటి ధరలు కూడా ఆకాశాన్నంటాయి.

మట్టి ప్రతిమలకు ఆదరణ

పర్యావరణానికి హితమైన మట్టితో చేసిన వినాయకుడి విగ్రహాలు వాడాలని ప్రజలకు అవగాహన వచ్చింది. దీంతో వాటికి ఆదరణ పెరిగింది. అలాగే నగరంలో చాలా చోట్ల దాతలు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

ఆలయాల ముస్తాబు

నగరంలోని ప్రధాన వినాయక ఆలయాలతో పాటు వీధుల్లో ఏర్పాటు చేసిన చవితి పందిళ్లలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. వాటిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. శృంగేరి జగద్గురు మహా సంస్థానం, శారదాపీఠం, శంకమఠంలో రత్నగర్భ గణపతి నవరాత్ర దీక్షా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వంకాయలవారి వీధిలోని అష్టసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ ఆలయానికి కాటన్ దొర ఒక గంటను బహూకరించారు. పుష్కరఘాట్‌లో అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

కడియం మండలంలో..

కడియం: మండల కేంద్రమైన కడియంతో పాటు, కడియపులంక, వేమగిరి, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, వీరవరం, దుళ్ల, మురమండ గ్రామాల్లో స్వామివారి ఆలయాల వద్ద పందిళ్లు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో ఆలయాలను సుందరంగా అలంకరించారు. ప్రధాన ఆలయాల వద్ద ఆయా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. కాగా.. పూజకు వినియోగించే పత్రి, తదితర వాటి కొనుగోళ్లతో కడియం దేవీచౌక్ సెంటర్‌లో సందడి నెలకొంది. వినాయక ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ తెలిపారు.

పువ్వులతో గణపతి చిత్రం

పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలని కడియపులంకలోని సత్యదేవ నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు అన్నారు. నర్సరీలో ఆదివారం వివిధ రకాల పువ్వులతో వినాయకుని చిత్రం ఏర్పాటు చేశారు.



పండ్లు, పత్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

మట్టి విగ్రహాలతో పర్యావరణ రక్షణ



క్వారీ సెంటర్‌లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎంపీ భరత్ రామ్ తదితరులు

- ఎంపీ భరత్ రామ్
- మట్టి ప్రతిమల పంపిణీ

సీటీఆర్ఐ: మట్టి గణపతి విగ్రహాలను పూజించి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్‌విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక క్వారీ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు అజ్జరపు వాసు ఆధ్వర్యంలో జరిగిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీకి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వినాయకుడిని మట్టితో తయారు చేయడం, పూజానంతరం నీటిలో నిమజ్జనం చేయడం, విఘ్నేశ్వరునికి వివిధ రకాల పత్రితో అర్చించడం..ఇవన్నీ ప్రకృతి ద్వారా మనకు లభించే ఆరోగ్య సూత్రాలను వివరించడానికేనన్నారు. కార్యక్రమంలో గుర్రం గౌతమ్, కడియాల లక్ష్మణరావు, నక్క నగేష్, ఎన్వీ శ్రీనివాస్, పీతా రామకృష్ణ, ఉల్లూరి రాజు పాల్గొన్నారు.

- మట్టి గణపతిని పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడదాం అనే నినాదంతో ఆర్తి స్వచ్ఛంద సేవాసంస్థ, సీసీసీ చానల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఏవీ అప్పారావు రోడ్డులోని శ్యామలా నగర్ శివాలయం సెంటర్‌లో ఆర్తి సంస్థ అధ్యక్షుడు ఎస్ఎన్ రాజా, సీసీసీ, బీసీఎస్ చానల్ ఎండీ పంతం కొండలరావు, బుడ్డిగ శ్రీనివాస్ తదితరుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 2 వేల ప్రతిమలను భక్తులకు అందజేశారు.



ఏవీఆర్ రోడ్డులో మట్టి ప్రతిమల పంపిణీ

భూముల ఆక్రమణలపై సర్వే నిర్వహిస్తాం

సీటీఆర్ఐ: భూముల ఆక్రమణ ఆరోపణల నేపథ్యంలో సర్వే నిర్వహిస్తామని గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం సంఘం పాలక మండలి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలపై పాలక మండలి సభ్యులు చర్చించి ఆమోదించారు. కొండబాబు మాట్లాడుతూ రేపటి నుంచి తొమ్మిది రోజుల పాటు ఆశ్రమ నిర్వహణలో ఉన్న వినాయక మందిరం వద్ద ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. సర్వే నంబర్ 123, 124, 133/2లోని మూడు ఎకరాల యాభై సెంట్ల స్థలానికి ఆనుకుని ఆరు ఎకరాలు అన్యాక్రాంతమైందంటూ సామాజిక మాధ్యమంలో పోస్టులు పెట్టారని, వాస్తవాలు తెలుసుకోవడానికి రికార్డుల ప్రకారం స్థలాలను సర్వే చేయడానికి సమావేశంలో తీర్మానించామన్నారు. మరోచోట మూడంతస్తుల భవనాన్ని అక్రమంగా నిర్మించారని దానిని త్వరలో బోర్డు డైరెక్టర్లు కూడా పరిశీలిస్తారన్నారు. ఆశ్రమ నిబంధనల ప్రకారం అనాథ బాలలకు, వృద్ధులకు మాత్రమే ఆశ్రయం కల్పించాల్సి ఉండగా కొందరు తల్లిదండ్రులు, బంధువులు తమ వారిని ఇక్కడ విడిచిపెట్టిన విషయం తమ దృష్టికి వచ్చిందని ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. వచ్చే నెల 8న స్వామివారి వర్ధంతి, 10న జయంతి నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆశ్రమానికి చెందిన రెండు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోగా అందుకు అందాల్సిన పరిహారం సంస్థకు రాలేదన్నారు. లీజు దారుడు ఈ విషయమై కోర్టుకు వెళ్లడం వల్ల పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారానికి తదుపరి సమావేశంలో చర్చిస్తామన్నారు. సమావేశంలో దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి, బోర్డు డైరెక్టర్లు నాగులపల్లి దేవి, తమ్మిశెట్టి రాధిక, అడపా వెంకట రఘు నందన్, చొల్లంగి ఏడుకొండలు, పిల్లి నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ బర్రే కొండబాబు తదితరులు

మట్టి ప్రతిమల పంపిణీ

రంగంపేట: వినాయక చవితి సందర్భంగా రాజమహేంద్రవరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అడుసుమిల్లి బాబు ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని వెంకటన్నపేట గ్రామంలో పర్యావరణ హితమైన మట్టి వినాయక ప్రతిమలను గ్రామస్తులందరికీ ఉచితంగా పంపిణీ చేశారు.

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ మెయిన్‌రోడ్డులో మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను స్థానిక లయన్స్‌క్లబ్ ప్రతినిధి ఛత్రపతి శివాజీ భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు.

బిక్కవోలు: మండలంలోని పందలపాక సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద పందలపాక స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ద్వారంపూడి శ్రీనివాస్‌రెడ్డి వినాయకుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సమితి కార్యదర్శి గొలుగూరి నాగిరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, గొలుగూరి శేఖర్‌రెడ్డి, దానబోయిన వెంకటరామ ప్రసాద్, కొవ్వూరి సతీష్ రెడ్డి, గొలుగూరి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక ప్రధాన రహదారి పక్కన వేంచేసియున్న శ్రీవినాయకుని ఆలయం వద్ద కమిటీ సభ్యులు చవితి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం, అచ్చియ్యపేట, వెలమపేట, బత్తుల వారి వీధి, మురళీనగర్, డ్రైవర్స్‌కాలనీ, పలు గ్రామాల్లో చవితి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు.

కిటకిటలాడిన మార్కెట్లు

రాజానగరం: నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండల కేంద్రాల్లో వినాయక చవితి సందర్భంగా పూలు, పండ్లు, పత్రి కొనుగోలు చేసే భక్తులతో మార్కెట్లు కిటకిటలాడాయి.

వైఎస్సార్ సీపీ నేత అంగర మృతి



అంగర ఉమా మహేశ్వరరావు (ఫైల్)

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వైఎస్సార్ సీపీ నాయకుడు అంగర ఉమామహేశ్వరరావు (ఉమ) (60) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని నివాసంలో ఆయన భౌతికకాయానికి ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, పలువురు పార్టీ నాయకులు నివాళులర్పించారు. లోక్‌సభ సమావేశాల కోసం ఢిల్లీ వెళ్లిన ఎంపీ భరత్ రామ్ అక్కడి నుంచి ఉమ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం తెలిపారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రకాశం నగర్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్ ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ జయంతిని స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథక ప్రారంభోత్సవాన్ని వీక్షించారు. అనంతరం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేస్తూ బీజేపీ నాయకులు స్థానిక క్వారీ సెంటర్లో ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, కురగంటి సతీష్ యెనుముల రంగారావు పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక మంచినీటి చెరువు వద్ద కొలువైయున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విశ్వకర్మ జెండాను ఆవిష్కరించారు. చేతివృత్తుల కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.సాయిరాం, వుండవిల్లి మాణిక్యం, చీపురు ఆంజనేయులు, మండవిల్లి గుప్తా, పేపకాయల రామచంద్రరావు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

కడియం: జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పుట్టిన రోజును పురస్కరించుకుని కడియంలోని ఆ పార్టీ నాయకులు ఆదివారం రాత్రి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మోదీ జన్మదిన వేడుకలు

ధవళేశ్వరం: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్రావు ఆధ్వర్యంలో ఆదివారం ధవళేశ్వరం బస్టాండ్ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్వామివారికి పువ్వులతో అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం

ప్రకాశం నగర్: నగరంలో ఫంక్షన్ హాల్లో ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు. అక్కినేని వనజ, ఆదిరెడ్డి అప్పారావు, గన్ని కృష్ణ, కాశి నవీన్, రెడ్డి మణి, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు మాతృ వియోగం

సీతానగరం: సీతానగరం పంచాయతీ సర్పంచ్ కోండ్రపు ముత్యాలు తల్లి పెంటమ్మ (80) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ముత్యాలు కన్న తల్లిదండ్రులు రెండేళ్ల క్రితం మరణించగా, దత్తత తీసుకున్న పెంటమ్మ అనారోగ్యంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆమెకు వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

ప్రకటన

మా క్లయింట్లు రాజమండ్రి పట్టణం మంగళవారపు పేట కాపురస్తులు యక్కల గోపాలకృష్ణమూర్తి గారి కుమార్తు యక్కల కనక రాజాజీ, యక్కల వీర నాగేశ్వరరావు గార్లు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికీ మా క్లయింట్లు వారి తాలూకు రాజమండ్రి పిడింగొయ్యి గ్రా.పం.లోని ఆర్.ఎస్.నెం.42/1 రులోని ప్లాటు నెం.19 తాల్కు ఉత్తర దిశలో గల 552 చ.గ.లకు హక్కుదారుల నియు సదరాస్థి మా క్లయింట్లు హక్కు భుక్తములలో గలదనియు మరియు సదరాస్థి చుట్టూ కాంపౌండ్ గోడ నిర్మించి గేటు పెట్టుకొని సీటి బోరు పాయింటును ఈశాన్య మూలంగా తవ్వించుకొని సదరాస్తిని అనుభవిస్తున్నారనియు, మా క్లయింట్లు సదరు స్థల విలువను 2003 సం.లో క్రియ దస్తావేజు రీత్యా శ్రీమతి మనవిల్లి వెంకటలక్ష్మి గారి నుండి కొనుగోలు చేసి అనుభవిస్తున్నారనియు యావన్మందికీ తెలియజేయడమైనది.

ఇట్లుండగా సదరాస్థి నుండి మా క్లయింటును బలవంతంగా తొలగించుటకు గాను కొవ్వూరు భాస్కరరెడ్డి, మనవిల్లి వెంకటలక్ష్మి, నర్సీపురం కీర్తి మరి యు ఇతరులు యత్నములు చేయగా మా క్లయింట్లు రాజమండ్రి ప్రి॥ సీ॥ సివిల్ జడ్జ్ కోర్టు నందు ఒ.ఎస్.నెం.71/2023 రు ను దాఖలు చేసి సదరు దావా నందు టెంపరరీ/ఇంజక్షన్ ఉత్తర్వులును పొంది ఉన్నారనియూ తెలియజేయడమైనది.

సదరాస్థి విషయమై ఎవరైననూ ఎటువంటి లావాదేవీలు జరిపినను, సదరాస్థి నందు ప్రవేశించిననూ మా క్లయింట్లు తీసుకొనబోవు యావత్తు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరని, ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయడమైనది.

రాజమహేంద్రవరం జి.ఎస్.ఎస్.మురళీమోహన్
ది. 17-09-2023 అడ్వకేట్
సెల్ : 93979 09167

సంక్షేమ పథకాలు జగన్‌తోనే సాధ్యం

గోకవరం: సంక్షేమ పథకాలు అమలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. గాదెలపాలెంలో తుమ్మలపల్లి గంగాధర్, గునిపే ఏడుకొండలు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి తోట నరసింహం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పక్క రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తోట రాంజీ, అత్తులూరి సాయిబాబు, గుల్లా ఏడుకొండలు, దాసరి చినబాబు, రామకుర్తి మూర్తి, ఇజ్జిన కిరణ్ కుమార్ కురాకుల సుమంగళి, పత్తి రమేష్ పాల్గొన్నారు.

పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా



గాదరాడలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, విజయలక్ష్మి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- గాదరాడలో నూతన పింఛన్ల పంపిణీ

మధురపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి నెలా ఠంఛన్‌గా అందజేస్తున్న సామాజిక పింఛన్లతో లబ్ధి దారులకు ఆర్థిక భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. నియోజకవర్గంలో నూతనం మంజూరైన 2,075 పింఛన్లను ఆదివారం కోరుకొండ మండలం గాదరాడలో ఆయన పంపిణీ చేశారు. అనంతరం లబ్దిదారులు ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలో 40,273 మందికి పింఛన్లుగా ప్రతినెలా 11,11,58,300 పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. చంద్రబాబు పాలనలో కేవలం 30 వేల మందికి మాత్రమే అందజేసేవారన్నారు. అలాగే 92 శాతం మంది పేదలకు తెల్ల రేషన్ కార్డులు అందజేశామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.1,100 కోట్లు, సంక్షేమ పథకాలకు రూ.1,000 కోట్లు ఖర్చు చేశామన్నారు. గాదరాడ గ్రామాభివృద్ధికి రూ.1.60 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. కాగా..కోరుకొండ హరేరామ సమాజం నుంచి గాదరాడ గ్రామం వరకూ భారీ బైక్ ర్యాలీ జరగింది. ఎమ్మెల్యే జక్కంపూడి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు ర్యాలీలో పాల్గొన్నాయి.

చంద్రబాబు అజెండాయే జనసేన జెండా

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అజెండాతోనే జనసేన అధినేత పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే రాజా అన్నారు. చంద్రబాబును సీఎం చేయాలన్నదే పవన్ లక్ష్యమన్నారు. ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టిన చంద్రబాబుకు ఆయన మద్దతు పలకడం దుర్మార్గమన్నారు. జనసేన రాజానగరం ఇన్‌చార్జిగా చెలామణి అవుతున్న బత్తుల బలరామకృష్ణ తన భార్య వెంకటలక్ష్మితో ఎంపీటీసీ పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జెడ్పీటీసీలు కర్రి నాగేశ్వరరావు, వాసంశెట్టి పెద్దవెంకన్న, చల్లమళ్ల లక్ష్మి, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ కన్వీనర్లు గణేశుల పోసి, దూలం పెద్ద, గండి నానిబాబు, కరుటూరి హరి, గంటా శ్రీను, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ నాయకులు హరిబోలు చినబాబు, కడియాల పాపారావు పాల్గొన్నారు.